నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 2 నవంబర్ 2024 | RANGAREDDY


వెలవెలబోతున్న ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

# రియల్.. ట్రబుల్..

## రంగారెడ్డి జిల్లాలో కుదేలైన రియల్ ఎస్టేట్ రంగం

గత 11 నెలల్లో సుమారు రూ.100 కోట్ల ఆదాయానికి గండి

- గణనీయంగా తగ్గిపోయిన భూముల క్రయవిక్రయాలు
- అయోమయంలో ఈ రంగాన్ని నమ్ముకున్న వ్యాపారులు, మధ్యవర్తుల పరిస్థితి
- చేసిన అప్పులకు మిత్తీలు కట్టలేక అవస్థలు

**రాష్ట్రంలోనే రియల్ ఎస్టేట్ రంగానికి గుండె కాయలాంటిది రంగారెడ్డి జిల్లా. గత బీఆర్ఎస్ హయాంలో రియల్ ఎస్టేట్ రంగం ఇక్కడ మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లింది. కానీ, రేవంత్ సర్కారు వచ్చాక హెచ్ఎండీఏ నిబంధనలు కఠినతరం కావడంతోపాటు హైడ్రా దూకుడు వల్ల రియల్ ఎస్టేట్ రంగం ఒక్కసారిగా కుదేలైంది. కేసీఆర్ హయాంలో జిల్లాలో నెలకు 18,000-22,000 వరకు రిజిస్ట్రేషన్లు జరిగేవి. కానీ, ఇప్పుడు నెలకు 1,500-1,600 వరకు మాత్రమే అయితున్నాయి. దీంతో గత 11 నెలల్లో జిల్లాకు రిజిస్ట్రేషన్ల ద్వారా సుమారు రూ. 100 కోట్లకు పైగా ఆదాయం తగ్గిపోయింది. ఎన్నికల తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊసేలేకుండా పోయింది.** -రంగారెడ్డి, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ)

జిల్లా పరిధిలో ఓ వైపు హెచ్ఎండీఏ, మరో వైపు ట్రిపుల్ఆర్ వంటి ప్రఖ్యాత రహదారులు వస్తున్నప్పటికీ రియల్ ఎస్టేట్ రంగం మాత్రం పుంజుకోవడం లేదు. హైదరాబాద్‌లో హైడ్రా దూకుడు ఓ కారణం కాగా.. హెచ్ఎండీఏ పరిధిలో వెంచర్ల అనుమతులకు నిబంధనలు కఠినతరం కావడంతో రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. గత బీఆర్ఎస్ హయాంలో ఐటీ, ఫాక్స్‌కాన్, కెమ్స్ వంటి ప్రముఖ వ్యాపార సంస్థలు జిల్లాకు రాగా ఈ వ్యాపారం పెద్దఎత్తున ఊపందుకున్నది. ఈ బిజినెస్‌ను ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంచుకున్న వారు కూడా ఎంతోమంది ఉపాధి పొందారు. కానీ, రేవంత్ సర్కారు వచ్చాక భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో అనేక నిబంధనలను తీసుకొచ్చింది. హెచ్ఎండీఏ పరిధిలో వెంచర్లు చేసేందుకు కూడా అనేక కొర్రీలు పెట్టడంతో అనుమతుల కోసం పెట్టిన దరఖాస్తులు కుప్పలు పేరుకుపోయాయి. మరోవైపు హైదరాబాద్‌లో హైడ్రా దూకుడు పెరగడంతో దాని ప్రభావం జిల్లాపైనా పడింది. జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో ప్లాట్లు, భూముల విక్రయాలు తగ్గిపోయాయి.

### రిజిస్ట్రేషన్ కార్యాలయాలు వెలవెల

కేసీఆర్ హయాంలో జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు క్యూ కట్టేవారు. కానీ, ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోయింది. 2023 సెప్టెంబర్‌లో జిల్లాలో 21,000 రిజిస్ట్రేషన్లు కాగా ప్రభుత్వానికి రూ.350 కోట్ల ఆదాయం వచ్చింది. కాగా 2024 సెప్టెంబర్‌లో 1,650 రిజిస్ట్రేషన్లు కాగా .. రూ. 220 కోట్ల ఆదాయం మాత్రమే సమకూరింది. నిత్యం రిజిస్ట్రేషన్లతో కళకళలాడే ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, పెద్దఅంబర్‌పేట, ఆమనగల్లు, మహేశ్వరం, శంషాబాద్, రాజేంద్రనగర్ వంటి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు నేడు రిజిస్ట్రేషన్లు లేక వెలవెలబోతున్నాయి. అలాగే, ఈ రంగంపై ఆధారపడిన మధ్యవర్తులు, ఇతరులు పూర్తిగా ఉపాధిని కోల్పోయారు.

### చాలామంది రోడ్డున పడ్డారు..



రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఎన్నో ఏండ్లుగా ఉన్నా. ఇలాంటి పరిస్థితినీ ఎప్పుడూ చూడలేదు. ప్రస్తుతం ఈ రంగం పూర్తిగా అస్తవ్యస్తం కావడంతో దీనిని నమ్ముకున్న నాతోపాటు ఎంతోమంది రోడ్డునపడ్డారు. అప్పులు చేసి ప్లాట్లు, భూములను కొనుగోలు చేశా. ప్రస్తుతం వాటిని కొనేందుకు ఎవరూ రావ డం లేదు. అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నా.

**- కాకి నాగార్జున్, ఇబ్రహీంపట్నం**

### హెచ్ఎండీఏలోనూ అంతంతే..

జిల్లాలోని హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న మండలాల్లోనూ రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా స్తంభించిపోయింది. గండిపేట, శంషాబాద్, రాజేంద్రనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, షాద్‌నగర్, శేరిలింగంపల్లి, ఫరూఖ్‌నగర్, మొయినాబాద్, షాబాద్, చేవెళ్ల వంటి మండలాలు ఒకప్పుడు రియల్ ఎస్టేట్‌తో కళకళలాడేవి. కానీ, ప్రస్తుతం హైడ్రా ప్రభావంతో రియల్ వ్యాపారం పూర్తిగా పడిపోయింది. శివారు ప్రాంతాల్లో ప్లాట్లు కొన్నవారంతా అయోమయంలో పడ్డారు. కొనుగోలు, అమ్మకాలు తగ్గిపోయాయి. అదేవిధంగా జిల్లా లోని పలు మండలాల నుంచి ట్రిపుల్ఆర్ వెళ్లడంతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీలు ఉన్నా అక్కడి ప్రాంతాల్లో భూములను కొనేందుకు ప్రజలు అంతగా ఇష్టపడడంలేదు.

### మిత్తీలు కట్ట లేకపోతున్నా..

రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని నమ్ముకొని రూ. లక్షలు అప్పులుచేసి భూములపై పెట్టుబడి పెట్టా. బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందన్న నమ్మకంతో భూములు, ప్లాట్లను కొన్నా. తీరా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ రంగం పూర్తిగా కుదేలైపోయింది. చేసిన అప్పులకు మిత్తీలు కట్టలేని పరిస్థితి నెలకొన్నది. నా 25 ఏండ్ల వ్యాపారంలో ఇంత గడ్డు పరిస్థితి ఎప్పుడూ చూడలేదు.



**- అచ్చన శ్రీశైలం**

### బోసిపోతున్న రియల్ ఎస్టేట్ కార్యాలయాలు

గతేడాది నవంబర్‌లో జిల్లాలోని వేలాది రియల్ ఎస్టేట్ కార్యాలయాలు రంగురంగుల విద్యుత్‌దీపాలతో దీపావళి పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ ఏడాది రియల్ ఎస్టేట్ రంగం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రియల్ ఎస్టేట్ కార్యాలయాలన్నీ దీపాలకు కూడా నోచుకోని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని 21 మండలాల్లో సుమారు 15,000- 20,000 వరకు రియల్ ఎస్టేట్ కార్యాయాలుంటాయి. ప్రస్తుతం వాటిలో సగానికి పైగా మూతపడ్డాయి. ఈ పరిస్థితికి రేవంత్ సర్కారే కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు.






# పాలమూరుపై పగ
## కేవలం కొడంగల్ నియోజకవర్గానికే సాగు నీరందించేందుకు సన్నాహాలు
# కాంగ్రెస్ నిలువెత్తు దగా

- వికారాబాద్ జిల్లాలోని మిగిలిన మూడు నియోజకవర్గాలకు సాగునీరు లేనట్లేనా
- పరిగి, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాలపై సవతి ప్రేమ
- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో జిల్లాలోని 5 లక్షల ఎకరాలకు సాగునీరందించేలా ప్లాన్..
- 80% పనులు పూర్తి
- ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.వేల కోట్లను ఖర్చు చేసిన గత ప్రభుత్వం
- కొడంగల్‌లోని కేవలం లక్ష ఎకరాలకు సాగునీరందించేందుకు ప్రస్తుత ప్రభుత్వం సన్నాహాలు
- రూ.4300 కోట్లతో చేపట్టిన కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు

**వికారాబాద్ జిల్లా ప్రజల ఆశలు ఆడియాశలయ్యాయి. ఏడాదిలో జిల్లాకు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నుంచి సాగు నీరొస్తుందని సంతోషిస్తున్న తరుణంలో రేవంత్ సర్కార్ నీళ్లు చల్లింది. కేవలం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ సెగ్మెంట్‌కే సాగు నీరందించేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్న సీఎం.. మిగిలిన వికారాబాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాలపై సవతి తల్లి ప్రేమను చూపుతున్నారు. ఇక ఈ ప్రాంతాలకు పాలమూరు నీళ్లు రావడం ప్రశ్నార్థకంగా మారింది. ఓటేసి గెలిపించిన పాపానికి కాంగ్రెస్ ప్రభుత్వం మమ్మల్ని నిలువునా మోసం చేస్తున్నదని రైతులు మండిపడుతున్నారు.**

–వికారాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ)

కొడంగల్ నియోజకవర్గం నుంచి విజయం సాధించిన రేవంత్‌రెడ్డి.. ముఖ్యమంత్రి కావడంతో జిల్లాలోని కొడంగల్, వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల ప్రజలు సంబురపడ్డారు. ఇక మా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని భావించారు. అయితే తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ సెగ్మెంట్‌పై తప్ప జిల్లాలోని మిగతా నియోజకవర్గాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పట్టింపు లేదనేది ప్రజలకు ఏడాది గడవకముందే స్పష్టంగా తెలిసిపోయింది. కొడంగల్‌కు నిధుల వరద, సాగునీరిచ్చే ప్రాజెక్టును చేపట్టిన రేవంత్‌రెడ్డి.. మిగిలిన మూడు సెగ్మెంట్లపై సవతి తల్లి ప్రేమను చూపుతున్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలైన వికారాబాద్, తాండూరు, కొడంగల్, పరిగి ప్రాంతాల్లోని సుమారు ఐదు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రతిష్టాత్మంగా చేపట్టి.. రూ.వేల కోట్ల నిధులను ఖర్చు చేసింది. పనులు చివరి దశకు చేరుకోగా.. రాష్ట్రంలో ప్రభుత్వం మారి.. రేవంత్‌రెడ్డి సర్కారు అధికారంలోకి రావడంతో ఆయన ఈ ప్రాజెక్టును పక్కన పెట్టడంతో వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల ప్రజల బతుకులు ప్రశ్నార్థకంగా మారాయి. కేవలం కొడంగల్ సెగ్మెంట్‌తోపాటు సొంత జిల్లాపై ఉన్న ప్రేమతో మక్తల్, నారాయణపేట జిల్లాలకు సాగు నీరందించేందుకు కొడంగల్-నారాయణపేట్ ఎత్తిపోతల ప్రాజెక్టుకు రూ. 4,300 కోట్లతో చేపట్టారు. కొడంగల్ సెగ్మెంట్‌లో లక్ష ఎకరాలకు సాగు నీరందించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్న సీఎం.. మిగిలిన మూడు నియోజకవర్గాలకు సాగునీటిని ఎప్పుడు తీసుకొస్తా రు.. ఈ ప్రాంత రైతుల గోసను ఎప్పుడు తీరుస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు జిల్లా నుంచి సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో వికారాబాద్ జిల్లా మొత్తం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ఆశించిన ప్రజలకు వికారాబాద్, తాండూరు, పరిగి ఎమ్మెల్యేల వైఫల్యంతో నిరాశే ఎదురవుతున్నది. ముఖ్యమంత్రి కేవలం కొడంగల్ నియోజకవర్గానికి మాత్రమే సాగు నీరందించేలా చర్యలు తీసుకుంటున్నా ముగ్గురు ఎమ్మెల్యేలు తమ సెగ్మెంట్లకు సాగు నీరందించడంపై ఇప్పటివరకు నోరు మెదపకపోవడం బాధాకరం.

### 80% పూర్తైన పనులు..

ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు సాగు నీరందించే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు 80శాతం వరకు పూర్తయ్యాయి. అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల ముందు నార్లాపూర్ రిజర్వాయర్ లిఫ్ట్-1 వద్ద వెట్‌రన్‌ను అప్పటి సీఎం కేసీఆర్ ప్రారంభించారు. బీడులు బారిన ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు సాగునీరందించి ప్రజల ఏండ్ల కలను నెరవేర్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును చేపట్టి రూ. వేలకోట్లను ఖర్చు చేసింది. అయితే ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాగా, కేవలం సాగు నీరందించేందుకు కాల్వల పనులను మాత్రమే తవ్వాల్సి ఉన్నది. ఆ పనులకూ బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. అయితే ఏడాదిలో సాగు నీరొస్తుందని ఆశతో ఎదురు చూసిన జిల్లా రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో నిరాశే మిగిలింది. జిల్లాకు ఉద్దండాపూర్ రిజర్వాయర్ ద్వారా సాగు, తాగు నీరందించేలా ప్లాన్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తైతే జిల్లాలోని సుమారు 5 లక్షల ఎకరాలకు సాగు నీరందడంతోపాటు జిల్లాలోని 566 గ్రామ పంచాయతీల్లోని 910 హాబిటేషన్లకు తాగు నీరందించేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు. అయితే ప్రాజెక్టు తుది దశలో ఉండగా ప్రభుత్వం మారి.. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రావడంతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులపై శీతకన్ను వేయడంతో పనులు ఎక్కడిక్కడ నిలిచిపోయాయి.

### మెఘా, రాఘవ కంపెనీలకు పనులు అప్పగించడంలో ఆంతర్యమేమిటో..?



కొడంగల్-నారాయణపేట్ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పనులను మెఘా ఇంజినీరింగ్ కంపెనీ, రాఘవ కంపెనీలకు సగం సగం అప్పగించడంలో ఆంతర్యం ఏమిటో సీఎం ప్రజలకు చెప్పాలి. అప్పట్లో మెఘా ఇంజినీరింగ్ కంపెనీని విమర్శించిన రేవంత్‌రెడ్డి అదే కంపెనీకి ఇప్పుడు ఎందుకు ప్రాజెక్టును అప్పగించారు. నల్లగొండ జిల్లా సుంకిశాలలో రూ.75 నుంచి రూ.80 కోట్లకు పైగా నష్టం వచ్చేందుకు కారణమైన మెఘా కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టకుండా ప్రాజెక్టు పనులను ఎందుకు ఇస్తున్నారో వివరించాలి.

**-మ్యాదరి చంద్రశేఖర్, గ్రామం, యాలాల**

### వికారాబాద్ జిల్లాకు అన్యాయం..



తుది దశలో ఉన్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పక్కన పెట్టి వికారాబాద్ జిల్లా ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసింది. వికారాబాద్, తాండూరు, కొడంగల్, పరిగి నియోజకవర్గాల్లోని 5 లక్షల ఎకరాలకు సాగునీరందించేలా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టింది. అయితే రేవంత్ ప్రభుత్వం కేవలం కొడంగల్ సెగ్మెంట్‌కే సాగునీరందించేలా కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని చేపట్టి మూడు నియోజకవర్గాల ప్రజలను మోసం చేస్తున్నది. డబ్బులను దండుకునేందుకు కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును చేపట్టారే తప్ప కొడంగల్‌పై రేవంత్‌రెడ్డికి ఎలాంటి ప్రేమ లేదు.

**- పి.సబితాఇంద్రారెడ్డి, మాజీ మంత్రి**

### రాష్ట్రం అంటే ఒక కొడంగలేనా..?



సాగు, తాగు నీటి కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నది. ఈ ప్రాజెక్టు పూర్తైతే మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నారాయణపేట్, వికారాబాద్, నాగర్‌కర్నూల్, నల్గొండ జిల్లాల్లోని 70 మండలాలకు, 1226 గ్రామాలకు న్యా యం చేకూరుతుంది. కేవలం కొడంగల్‌కు సాగు నీరిచ్చే లా ప్రణాళికలు రూపొందించడం ఎంత వరకు సమంజసం. రాష్ట్రం అంటే ఒక కొడంగలేనా..?

**-కోరవని గణేశ్, జక్కేపల్లి గ్రామం, యాలాల**

### రైతులకు అన్ని కష్టాలే..



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు అన్ని కష్టాలే. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా వికారాబాద్ జిల్లాలోని రైతులందరికీ నీరు అందేలా గత కేసీఆర్ ప్రభుత్వం ప్రణాళికను రూపొందించగా.. రేవంత్ సర్కారు మాత్రం కేవలం కొడంగల్ సెగ్మెంట్‌కే ఈ పథకాన్ని పరిమితం చేయడం సరికాదు. దీంతో మిగిలిన మూడు నియోజకవర్గాలకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతారు.

**-మల్గ చంద్రయ్య, రైతు, అంగడిచిట్టంపల్లి గ్రామం, పూడూరు**

### జిల్లాలను ఎడారిగా మార్చే ప్రయత్నం



కృష్ణానది మహారాష్ట్ర, కర్ణాటక రా ష్ట్రాల మీదుగా వెళ్తూ తెలంగాణలోని నారాయణపేట్ జిల్లా కృష్ణ మండలంలోకి ప్రవేశిస్తుంది. కృష్ణానదిపై తెలంగాణలో జూరాలను తొలి ప్రా జెక్టుగా నిర్మించారు. జూరాల నుంచి నికర జలాలను తమ ప్రాంతానికి సాగు, తాగు నీరు ఇచ్చే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఊట్కూరు, జాజాపూర్, జయమ్మచెరువు, కానుకుర్తి దగ్గర రిజర్వాయర్లను నిర్మించి అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా ఊట్కూరు, జాజాపూర్, జయమ్మచెరువు, కానుకుర్తి, లక్ష్మీపూర్, ఈర్లపల్లి, దౌల్తాబాద్, హస్నాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట చెరువులను కాకరవాణి ప్రాజెక్టుతో నింపనున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదు జిల్లాలను సస్యశ్యామలం చేసేలా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రూపకల్పన చేస్తే ఈ ప్రభుత్వం అందులోని చాలా జిల్లాలను ఎడారిగా మార్చే ప్రయత్నం చేస్తున్నది.

**-ఉప్పలి మల్కయ్య, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి**

### మూడు సెగ్మెంట్లకు సాగునీటిని అందించాలి



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే సాగునీటిని కొడంగల్ ప్రాంతానికే అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సమంజసం కాదు. రాష్ట్రంలోనే వికారాబాద్ జిల్లా వెనుకబడి ఉన్నది. అందువల్ల కొడంగల్‌తోపాటు జిల్లాలోని మిగిలిన మూడు నియోజకవర్గాలకు కూడా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని అందించి వాటి అభివృద్ధికి కృషి చేయాలి. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలను సమానంగా చూడాలి. **-హరీశ్‌రావు, రైతు మోమిన్‌కలాన్ , ధారూరు**

### శీతకన్ను తగదు



రేవంత్ సర్కార్ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నీటిని కేవలం కొడంగల్ సెగ్మెంట్‌కే సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడం సబబు కాదు. వికారాబాద్ జిల్లాలోని మిగిలిని పరిగి, తాం డూరు, వికారాబాద్ నియోజకవర్గాలకు సాగునీటిని అందించకుంటే ఆ ప్రాంతాల్లో నీటి వనరుల్లేక ఎడారిగా మారే ప్రమాదం ఉన్నది. ప్రభుత్వం మూడు నియోజకవర్గాలపై సవతి ప్రేమను చూపొద్దు.

**- రైతునాగరాజ్, రొంపల్లి, బంట్వారం**

# వెలుగుల వేడుక
## ఘనంగా దీపావళి పండుగ


షాద్‌నగర్ టౌన్‌లో..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వెలుగుల వేడుక దీపావళి పండుగను గురువారం చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా అందరూ ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వ్యాపార సముదాయాలు, షాపుల్లో లక్ష్మీదేవి పూజ లు నిర్వహించారు. సాయంత్రం సమయంలో గృహాలు, షాపుల ఎదుట ప్రమీదలు వెలిగించి ..భారీ ఎత్తున పటాకులు కాల్చారు. పండుగ సందర్భంగా బంతి పూలు, పటాకుల రేట్లు రెట్టింపయ్యాయి.

**- న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ**


మొయినాబాద్‌లో..